



సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
శుక్రవారం 14, జూన్ 2024
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం

## సీతారామ ప్రాజెక్టు ను పనులను పరిశీలించిన

# మంత్రుల బృందం

- రూ 8 వేల కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరానికి నీరు ఇవ్వని బిఆర్ఎస్ ప్రభుత్వం
-సీతారామ పేరిట రీ డిజైన్ తో ప్రజాధనం దుర్వినియోగం
-ఆగస్టు 15 నాటికి లక్షా ఇరవై వేల ఎకరాలకు గోదావరి నీళ్లు
-ఎన్కూర్ లింకు కెనాన్ కు రాజీవ్ కెనాల్ గా నామకరణం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





2 లో..

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో సూర్య (మేజర్ న్యూస్) - సీతారామ ప్రాజెక్ట్ క్షేత్ర పరిశీలనను గురువారం మంత్రుల బృందం చేపట్టింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర నీటిపారుదల, ఆహారం పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం అమ్మవారి పల్లి గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్ హెడ్ రెగ్యులేటరీ వద్దకు హెలిక్యాప్టర్లో చేరుకుని సీతారామ ప్రాజెక్టు వ్యూ పాయింట్ సందర్శించి, ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు.

## డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల ను అభినందించిన మంత్రి తుమ్మల



2 లో..

## రూ 75 లక్షల విలువ గల గంజాయి పట్టివేత

-186 కేజీల గంజాయిని తరలిస్తున్నముగ్గురి వ్యక్తుల అరెస్ట్
- 1 టౌన్ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ



2 లో..

## కార్పొరేట్ విద్య సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి.

-విద్యాసంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి.
-ఏఐఎస్ఎఫ్.



2 లో..

## సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్ట్ బ్యారేజీలను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు

- చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నిలిచిపోయిన సీతమ్మ సాగర్ పనులు

-నేడు మంత్రుల పర్యటనతో చిగురిస్తున్న ఆశలు

అశ్వాపురం, సూర్య (మేజర్ న్యూస్)- మండలంలోని అమ్మగారిపల్లి కుమ్మరిగూడెం గ్రామాల వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులను తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగిలేటి శ్రీనివాసరెడ్డి , ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో కలిసి సీతమ్మ సాగర్ బ్యారేజ్ ను గురువారం పరిశీలించారు.



2 లో..

# సీతమ్మ సాగర్, సీతారామ ప్రాజెక్ట్ బ్యారేజీలను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు



ఈ క్రమంలో అక్కడి నుండి నేరుగా బిజీ కొత్తూరు సమీపంలో ఉన్నటువంటి సీతారామ ప్రాజెక్ట్ పనులునునిలిచిపోవడానికి గల కారణాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ఆర్ చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉమ్మడి ఖమ్మం జిల్లా కు సాగునీటి అవసరాల కోసం రాజీవ్ సాగర్ ఇందిరా సాగర్ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. తెలంగాణ తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ రెండు ప్రాజెక్టులను రద్దు చేసి సీతమ్మసాగర్ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో సుమారు 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చును. దీంతోపాటు 320 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్ధ సాధక ప్రాజెక్టుగా సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.ఇక్కడ స్థానిక రైతులు కొందరు గిరిజనులతో కలిసి పర్యావరణ అనుమతులు తీసుకోకుండా అశ్వాపురం మండలంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనులు వల్ల తాము నష్టపోతున్నామని ప్రాజెక్టు నిర్వాసితులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఎన్జిటిని ఆ ఆశ్రయించారు. వారు సమర్పించిన వివరాలతో పాటు ఎన్జీటీ స్వయంగా దిసభ్య కమిటీని నియమించి పలు ఆధారాలు సేకరించింది. ఇరిగేషన్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టు ఎలా ప్రారంభించారు అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అన్నిటిని పరిగణలోకి తీసుకొని సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి గత ఏడాది ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంఆలా, ఐటీడీఏ పిఓ, ప్రతీక్ జైన్, ఇన్చార్జి ఎస్పీ, సునీల్ దత్,ఇరిగేషన్ శాఖ సి.ఈ. యస్,ఈ., పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోదెంవీరయ్య వైరా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ బాలసానిలక్ష్మీనారాయణ, స్థానిక ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరిగంటి బిక్షమయ్య స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు ను పనులను పరిశీలించిన మంత్రుల బృందం




వ్యూ పాయింట్ వద్ద సాగునీటి అధికారులు ఏర్పాటుచేసిన సీతారామ ప్రాజెక్ట్ ఫోటో ప్రజెంటేషన్ ను మంత్రుల బృందం తిలకించింది. ఇప్పటివరకు పూర్తయిన సీతారామ ప్రాజెక్టు పనుల వివరాలను డిప్యూటీ సీఎం, మంత్రులకు సాగునీటి పారుదల శాఖ అధికారులు వివరించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పంప్ హౌజ్ -1 పనులను పరిశీలించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పంప్ హౌజ్ -1 కంట్రోల్ రూమ్ లో పవర్ సప్లై ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి ప్రారంభించారు. అనంతరం సీతారామసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వి.కే. రామారం గ్రామం వద్ద ఉన్న పంప్ హౌజ్- 2 పనులను, ములకలపల్లి మండలం పూసగూడెం గ్రామంలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పంప్ హౌజ్ -3ని సందర్శించి పనులను పరిశీలించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి ఎన్కూరు లింకు కెనాల్ ను పూర్తి చేసి లక్షా ఇరవై వేల ఎకరాలకు గోదావరి నీళ్లను అందిస్తుందని తెలిపారు. కేవలం రూ 2654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను సీతారామ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసి రూ 20 వేల కోట్లకుహౌ గత ప్రభుత్వంలో పెంచారని, దశాబ్ద పాలనలో సీతారామ ప్రాజెక్టుపై రూ 8 వేల కోట్ల ను ఖర్చు పెట్టిన గత ప్రభుత్వం ఒక్క ఎకరానికి కూడా తాగునీరు ఇవ్వలేదన్నారు. సీతారామ ప్రాజెక్టు కు ఎన్ఎస్పిఎల్ కెనాల్ కు లింకు చేయడానికి 9 కిలోమీటర్లు ఉన్న ఎన్కూర్ లింక్ కెనాల్ ను పూర్తి చేయడానికి రూ 72 కోట్లు మంజూరి చేశామన్నారు. ఎన్నికల కోడ్ ముందు ఈ పనులను సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వైరాకు వచ్చి శంకుస్థాపన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా పంప్స్ ట్రయల్ రన్ చేయడానికి కావలసిన పవర్ సప్లై కోసం నిధులు ఇచ్చామన్నారు. ఎన్కూర్ లింకు కెనాల్ ను రాజీవ్ కెనాల్ గా నామకరణం చేస్తున్నట్టు వెల్లడించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ హౌజ్ 1, 2, 3 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులు తొందరలోనే మొదలు పెడతామని వెల్లడించారు.సమీక్ష లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టుకు రూ90400 కోట్ల ఖర్చుపెట్టి కేవలం 93వేల ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సాగులోకి తీసుకువచ్చిందన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ 27 వేల కోట్లను, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ 9000 కోట్లను ఖర్చుపెట్టి ఒక ఎకరం కొత్త ఆయకట్టుకు కూడా నీరు ఇవ్వలేదన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం గోదావరి నది జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకొచ్చి సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. రీడిజన్ పేరిట తప్పుడు నిర్ణయం తీసుకొని రాష్ట్రానికి హార్దిక భారం మోపినప్పటికీ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 1997-98 లో దుమ్ముగూడెం ప్రాజెక్టు పేరున ప్రారంభమై, రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇందిరా రాజీవ్ ప్రాజెక్టుగా మారి, ఇప్పుడు సీతారామ ప్రాజెక్టుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో రూ 400 కోట్లతో ప్రారంభించిన పనులను బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు రీ డిజైన్ చేసి ఖర్చును 20 వేల కోట్లకు పెంచిందని, కానీ పనులు పూర్తి చేయలేదని అన్నారు. సాంకేతిక పరంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆలోచన లేకుండా ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్యమైన పనులు పూర్తి చేయకుండా నిధులు ఖర్చు చేయడంతో పరిస్థితి బూడిదలో పోసిన పన్నీరులా మారిందన్నారు. గోదావరి నీళ్లతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,20,000 ఎకరాల ఆయకట్టు, నాగార్జునసాగర్ కాల్వ కింద నీరు అందేలా ప్రయత్నిస్తామన్నారు. ప్రణాళిక బద్ధంగా పనిచేసి ఆగస్టు 15 కల్లా జిల్లాలోని రైతులకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ సిబ్బందిని మంత్రి ఆదేశించారు. కొత్తగూడెం,ఇల్లందు, పినపాక నియోజకవర్గాల రైతులకు ఆయకట్టు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు,కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి,పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఇర్రిగేషన్ సిఇ శ్రీనివాస రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్య సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి

పాల్వంచ,సూర్య(మేజర్ న్యూస్) - కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీ ని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అజిత్ డిమాండ్ చేశారు. ఫీజు దోపిడీని అరికట్టాలినీ, విద్యాసంస్థల్లో స్టేషనరీ అమ్మకాలపై చర్యలు తీసుకోవాలినీ, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలినీ డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ అధికారి శ్రావణి కి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అజిత్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం పున ప్రారంభమైనందున ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి తక్షణమే పాఠ్యపుస్తకాలు యూనిఫాంలో విద్యార్థులకు అందజేయాలని డిమాండ్ చేశారు. పాల్వంచలో విచ్చలవిడిగా వెలసిన కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులును విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, విద్యా హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేయడమే కాక విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ మొత్తం తమ దగ్గరే కొనాలని షరతులు పెడుతున్నారని వాటిని తమ ఇష్టానుసారంగా అధిక రేట్లకు అమ్ముతున్నారని తక్షణమే ఈ అమ్మకాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు ఏఐఎస్ఎఫ్ సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల సృజన్, వెంకటేష్, చందూలాల్, రాజు, శ్రీకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

## రూ 75 లక్షల విలువ గల గంజాయి పట్టివేత

కొత్తగూడెం క్రైమ్,సూర్య (మేజర్ న్యూస్)- రూ 75 లక్షల విలువ గల 186 కేజీల గంజాయిని 1 టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1 టౌన్ సిఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం....గురువారం వాహనాల తనిఖీలలో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు కొత్తగూడెం 1 టౌన్ ఎస్సై విజయ తన సిబ్బందితో కలిసి కొత్తగూడెం బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జ్ వద్ద వెహికల్ చెకింగ్ చేయుచుండగా సుమారుగా మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు స్విఫ్ట్ డిజైర్ టి ఎస్ 17జే 4458 అను నంబరు గల కారులో అనుమానాస్పదంగా కనిపించగా అట్టి కారును క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. పూర్తిగా కారును తనిఖీ చేయగా మొత్తం 93 ప్యాకెట్లలో 186 కేజీల బరువు గల రూ 75 లక్షల విలువ గల నిషేధిత గంజాయిని స్వాదీనం చేసుకుని వారిని పట్టుకోవడం జరిగింది. జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి 1టౌన్ పోలీసులు ఇట్టి గంజాయిని పట్టుకోవడం జరిగిందని సిఐ కరుణాకర్ వెల్లడించారు. కామారెడ్డి జిల్లా పరిధిలోని మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట్ చెందిన పెనుగొండ నరసింహులు,కుంచం లక్ష్మణ్, నంది తండాకు చెందిన భూక్యా లక్ష్మణ్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ఈ ముగ్గురు నిందితులు ఒరిస్సా రాష్ట్రం, మల్కాన్ గిరి అటవీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్ర, షోలాపూర్ లో విక్రయించుటకు తీసుకెళ్తుండగా పట్టుకోవడం జరిగిందని వెల్లడించారు. ఈ ముగ్గురిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించడం జరిగిందని తెలియజేశారు. వాహన తనిఖీలలో నిషేధిత గంజాయిన అక్రమంగా తరలించే నిందితులను పట్టుకున్న సీసిఎస్, వన్టౌన్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

## డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల ను అభినందించిన మంత్రి తుమ్మల

పాల్వంచ,సూర్య(మేజర్ న్యూస్) - రాష్ట్ర వ్యవసాయ శాఖ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ను అభినందించారు. గురువారం గండుగులపల్లిలోని మంత్రి నివాసంలో డిసిఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావుతో పాటు పాల్వంచ కాంగ్రెస్ నాయకులు తుమ్మల ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సహకార మార్కెటింగ్ చైర్మన్ గా కొత్వాల ఎన్నికకావడం పట్ల మంత్రి అభినందించారు. డిసిఎంఎస్ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, నాయకులు వై . వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com

శుక్రవారం 14, జూన్ 2024

# తారు రోడ్ల, డ్రైనేజీల పనులను వెంటనే ప్రారంభించాలి

**-అంబేద్కర్ చమన్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి**
**-రాజీవ్ గాంధీ కాలనీలో సింగరేణి మంచినీటిని ఏర్పాటు చేయాలి**
**-సింగరేణి జిఎంకి వినతి పత్రం అందించిన సిపిఐ బృందం**



కొత్తగూడెంసింగరేణి,సూర్య(మేజర్‌న్యూస్)- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కార్మిక ప్రాంతమైన రామవరం మున్సిపాలిటీ పరిధి లో సింగరేణి ఆధ్వర్యంలో తారు రోడ్లకి డ్రైనేజీలకి టెండర్లు పిలిచి జాప్యం జరుగుతున్న పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఐ కౌన్సిలర్ల ప్రతినిధి బృందం సింగరేణి జిఎం సోలం రాజ్ కు వినతిపత్రాన్ని అందించారు. గురువారం స్థానిక రుద్రంపూర్ జిఎం ఆఫీసులో వినతి పత్రం అందించిన అనంతరం ఈ సందర్భంగా వారు జీఎంకు వివరిస్తూ రామవరం ప్రాంతంలో తారు రోడ్ల నిర్మాణానికి సుమారు రూ 1కోటి 30 లక్షలు కేటాయించి టెండర్లు పిలిచి రెండు సంవత్సరాలు దాటుతున్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించడం లేదని ,తక్షణమే పాత టెండర్లను రద్దుచేసి కొత్త టెండర్లను పిలిచి తారు రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఎప్పుడో వేసిన తారు రోడ్లు గుంటలమయంగా మారి కార్మిక ప్రాంత ప్రజలు, పాదచారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారికి వివరించారు. అలాగే నెహ్రూబస్తీ, నాగయ్య గడ్డ ,పంజాబ్ గడ్డ ,వనం దాస్ గడ్డ తదితర ప్రాంతాల్లో సింగరేణి క్వార్టర్ లో నీళ్లు బయటకు పోయే సైడ్ డ్రైనేజీలు లేక కార్మికులు ఇంట్లోనే ఇంకుడు గుంటలు తీసుకొని మురికి వాసనతో జీవనం కొనసాగిస్తున్నారని జిఎం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల క్రితం కాలువలకు కూడా టెండర్లు పిలిచి పనులు ప్రారంభించక సైడ్ డ్రైనేజీల నిర్మాణం జరగలేదని తక్షణమే సైడ్ కాలువల నిర్మాణానికి టెండర్స్ పిలిసి కాలువల నిర్మాణం చేపట్టాలని ,అలాగే రామవరం ప్రాంతంలోని శిథిలావస్థలో ఉన్న సింగరేణి కాలువల మరమ్మతులు చేపట్టాలని ఈ సందర్భంగా వారు జిఎం కి వివరించారు.అలాగే అంబేద్కర్ చమన్ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి దోహదపడాలని కోరారు .అలాగే గత 14 సంవత్సరాల క్రితం ఏరియా నుండి తరలించబడ్డ బాధితులకు నాగయ్య గడ్డ రాజీవ్ గాంధీ కాలనీలో గృహాలు ఏర్పాటు చేసుకున్న గృహవాసులకు సింగరేణి మంచినీళ్లు అందించి వారిని ఆదుకోవాలని జిఎం సోలెం రాజుకి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిఎం సంబంధిత సమస్యలను పరిశీలించి తక్షణమే సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారని తెలిపారు .జిఎం కి వినతి పత్రం ఇచ్చిన వారిలో 8, 10 ,11 వ వార్డుల కౌన్సిలర్లు కంచర్ల జములయ్య ,మునిగడప పద్మ, భూక్య శ్రీనివాస్ ,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండ జాగ్రత్తలు తీసుకోవాలి

**-ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యాధికారులు స్థానికంగా ఉండాలి**
**-స్థానికంగా లేని వైద్యాధికారులపై వేటు తప్పదు**
**-వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్..**



భద్రాచలం, సూర్య (మేజర్ న్యూస్) - వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివాసి గిరిజన గ్రామాలలోప్రజలకు ఆరోగ్యంపై అవేర్నెస్ కల్పించి గ్రామాలలో వ్యాధులు ప్రబలకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకొని వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్యాధికారులకు భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ ఆదేశించారు. ఏజెన్సీ మారుమూల అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసి గిరిజన కుటుంబాలకు వైద్య సిబ్బంది వైద్యాధికారులు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్థానికంగా ఉంటూ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని, స్థానికంగా లేని వైద్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సబ్ సెంటర్ పరిధిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు గిరిజన ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తూ సమయపాలన పాటించాలని ఆయన సూచించారు.ఎటువంటి జ్వర మైన, రక్త పరీక్షలు నిర్వహించి మలేరియా ఉన్నట్లయితే పూర్తి చికిత్స అందించి, మిగతా వ్యాధుల కోసం టీ హబ్ కి రక్త నమూనాలు పంపించి రిపోర్టులు వచ్చాక పూర్తి స్థాయిలో వైద్యం అందించాలని అన్నారు. గ్రామ పంచాయతీలో మండల హెడ్ క్వార్టర్‌లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది లైన్ డిపార్ట్మెంట్ తో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, గిరిజన ప్రజల ఆరోగ్య స్థితిగతుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఎల్ఎస్ఎన్ ఓబి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి, సూర్య (మేజర్ న్యూస్)- కోయగూడెం ఓపెన్‌లో ఎల్ఎస్ఎన్ ఓబిలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు ,హెల్పర్స్,ఆపరేటర్లు ,బ్లాస్టింగ్, వివిధ సెక్షన్ లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్టియు నాయకులు యాజమాన్యాన్ని గురువారం డిమాండ్ చేశారు. పదో తారీకు లోపు వేతనాలు ఇవ్వాలని ,8 గంటల పనిని అమలు చేయాలని, పిఎఫ్ ,సేఫ్టీ ఇంకా వివిధ సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో కార్మికులు సంతకాల సేకరణ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు డి .ప్రసాద్ మాట్లాడారు. గతంలో ఆందోళన నిర్వహించి సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించామన్నారు.ఆందోళన ఫలితంగా 12 గంటల పని స్థానంలో టైర్ సెక్షన్ వివిధ విభాగాల కార్మికులకు ఎనిమిది గంటల పని వర్తింప చేస్తున్నారని,మిగతా సమస్యలు అలానే అపరిష్కరణంగా ఉన్నాయన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డ్రైవర్లకు ,వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని, సేఫ్టీ రూల్స్ అమలు చేయాలని, కండిషన్‌లో ఉన్న బండ్లను నడపాలని,పెట్రోల్ అలవెన్స్ పెంచాలని, బ్లాస్టింగ్ కార్మికులకు బెల్లం ఇవ్వాలని ,అదేవిధంగా రెడ్ టీ షర్ట్స్ ఇవ్వాలని ,తదితర డిమాండ్ లుపరిష్కరించాల న్నారు. లేని యెడల ఐఎఫ్టియు ఆధ్వర్యంలో దశలవారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఎన్ కార్మికులు వీరన్న,లక్ష్మయ్య ,శ్రీను,చారి,రాందాస్, నవీన్ అనిల్ ,సాగర్ ,ఆరిఫ్ ,కిసాన్ తదితరులు పాల్గొన్నారు.



# పాల్వంచలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

**- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు అఖిలపక్ష నాయకులు**



పాల్వంచ,సూర్య(మేజర్ న్యూస్) - పట్టణ ప్రజలు కలుషితమైనటువంటి పరిశ్రమలు వెదజల్లుతున్న గాలి నీరు సేవించి, పేల్చి ,కిడ్నీ వ్యాధిన పడి ఎందరో అభాగ్యులు అమాయకులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. బ్రతికుండగానే, అందుకు కిడ్నీ డయాలసిస్ సెంటర్ కూడా పాల్వంచలో లేదు. గత్యంతరం లేక బాధితులు ఖమ్మం, భద్రాచలం, ఇల్లందు, కొత్తగూడెం, రోజుల తరబడి వేసి చూస్తూ వారానికి మూడు రోజులు డయాలసిస్ చేయించుకుంటున్న పరిస్థితి. ఈ పరిస్థితి మీద తెలుగుదేశం పార్టీ తరపున కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ను పాల్వంచలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా వారు పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకొని సంబంధిత వైద్య మంత్రి తో మాట్లాడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి కిడ్నీ డయాలసిస్ సెంటర్ ని ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో కృతజ్ఞతగా 20 మంది కిడ్నీ బాధితులు, తెలుగుదేశం, సిపిఐ కార్యకర్తలు, నాయకులు, ప్రభుత్వ వైద్యులు వెంకటేశ్వరరావు, సోమరాజు దొర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కి కృత్ఙతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కనగాల అనంత రాములు, జరబన సాంబశివరావు, చంద్ర రవి, బెల్లంకొండ బాబురావు, సిపిఐ నాయకులు సాయిబాబా, విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు , తదితర నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

# ఆశ వర్కర్లకు పరీక్షలు పెట్టే విధానాన్ని మార్చుకోవాలి -సిఐటియు



పాల్వంచ, సూర్య(మేజర్‌న్యూస్)- ఆశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వం ఆ తరువాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నా జిల్లాలోని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



ములకలపల్లి,సూర్య (మేజర్‌న్యూస్)-ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి 30 సంవత్సరాలుగా ఇక్కడే స్థిర నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికేట్ ఇవ్వాలని గురువారం రాచన్నగూడెంలో జరిగిన సమావేశంలో ఆదివాసీలు ప్రభుత్వాన్ని కోరారు. వలస ఆదివాసీల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశం లో 22 గ్రామాలనుంచి ముఖ్య నాయకులు హాజరై వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. తమపై ప్రభుత్వం వివక్ష చూపుతుందని, దీనిమూలం గా రెండోవ తరగతి పౌరులుగా అవమానం చవిచూస్తున్నామని అవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా పోడు సాగుచేస్తుంటే ప్రభుత్వం తమకు హక్కు పత్రాలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తుం దన్నారు. తమ గ్రామాలకు నేటికీ ఎలాంటి గుర్తింపు లేకుండా నిత్యం సమస్యలతో సతమతం అవుతున్నామన్నారు. ఆదివాసీలు ఐక్యంగా పోరాడి హక్కులు సాధించు కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మడకం రవి, వెట్టి ముఖేష్, సాయం మంగు, మడవి ఎడమ, సోయం లక్ష్మణ్, నందులాల్, చందు, రమేష్ పాల్గొన్నారు.

# రూ.10 లకే అల్పాహారం

- క్వాలిటీ, క్వాంటిటీలలో తేడా లేదు
- ఉదర పోషనార్థమే తప్ప ధనార్జన కోసం హొటల్ పెట్టలేదు
- కష్టమర్ల ఆశీర్వాదమే మాకు శ్రీరామరక్ష అంటున్న
-కేత సూరిబాబు, వెంకటలక్ష్మి దంపతులు





ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)–"సొంత లాభం కొంత మాని పరుల మేలును కొరవోయి" అన్న మహాకవి శ్రీశ్రీ మాటలను ఈరోజుల్లో ఎవరు లెక్క చేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా పూటకొక్క వేషం వేస్తూ రూపాయి పెట్టుబడితో వంద రూపాయలు సంపాదించాలని చూస్తున్న ఈ రోజుల్లో కేవలం తమ కుటుంబ ఉదర పోషణ కోసం హొటల్ నడుపుతూ అతి తక్కువ ధరకు టిఫిన్ అందిస్తున్న కేత సూరిబాబు, వెంకటలక్ష్మిల సేవా నిరతిని ప్రతి ఒక్కరు హర్షించవలసిందే. వివరాల్లోకి వెళ్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణం జెకె కాలనీలో గత 30 సంవత్సరాలుగా కేత సూరిబాబు, వెంకటలక్ష్మి దంపతులు హొటల్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సూరిబాబు తండ్రి కేత కృష్ణ 30 క్రితం ఆంధ్ర ప్రాంతం నుండి బ్రతకడానికి ఇల్లందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానిక జెకె కాలనీ బస్ స్టాప్ దగ్గర చిన్న హొటల్ పెట్టుకున్నారు. కొంతకాలం తర్వాత కృష్ణ మృతి చెందడంతో ఆయన కుమారుడైన కేత సూరిబాబు, వెంకటలక్ష్మి దంపతులు హొటల్ ను నడుపుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో రూ 10 లకే టిఫిన్ అందించాలన్న ఒక మంచి సంకల్పం వారిలో కలిగింది. ఈ మేరకు అంతకు ముందున్న రేట్లను వారు సవరించారు. కేవలం రూ 10 లకే నాలుగు ప్లేట్ ఇడ్లీ, నాలుగు బోండా, నాలుగు పూరి, నాలుగు వడ లను అందిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఉదయం 6 గంటల నుండి దినసరి కూలీలు, స్కూల్ పిల్లలు, సింగరేణి ఉద్యోగులు, అటు గుండా వెళ్లే బాటసారులు ఈ హొటల్ లో టిఫిన్ తిని వెళుతుంటారు. ఇదిలా



ఉండగా హొటల్ కు సమీపంలోని కాలనీవాసులు ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉంటే వారికి వివిధ రకాల టిఫిన్లు తయారు చేసి పెట్టలేక తలా పది రూపాయలు చేతిలో పెట్టి హొటల్ కు పంపిస్తుండడంతో తమకు నచ్చిన ఇడ్లీ, వడ, పూరి, బోండా లాంటి టిఫిన్లను తిని ఆనందంగా స్కూల్ కి వెళ్లడం గమనార్హం. హొటల్లో అల్పాహారాన్ని ఆరగించిన కస్టమర్లు కూడా అతి తక్కువ ధరకు టిఫిన్ అందించడం తమకెంతో ఆనందంగా ఉందని పేర్కొంటున్నారు.

**–ఉదర పోషనార్థమే తప్ప లాభార్జన కోసం హొటల్ నడపడం లేదు**

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నలుగురికి సహాయపడాలన్న ఉద్దేశంతో పది రూపాయలకే టిఫిన్ ను అందిస్తున్నామని హొటల్ యజమానులు కేత సూరిబాబు వెంకటలక్ష్మి పేర్కొన్నారు. అయితే మాస్టర్, సప్లయర్లను పెడితే తమకు ఏమీ మిగలదని, కాబట్టి తామే మాస్టర్, సప్లయర్ల అవతారమెత్తి స్వయంగా పనులు చేసుకుంటున్నామని, అవసరమైతే ఒకరిద్దరిని సహాయకులుగా పెట్టుకుంటున్నామన్నారు. ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు టిఫిన్ అందుబాటులో ఉంటుందని, క్వాలిటీ, క్వాంటిటీలలో విషయంలో ఎలాంటి తేడాలు ఉండవని, అతి తక్కువ ఖర్చుతో కడుపు నింపుకొని వెళుతూ తమను కొందరు ఆశీర్వదించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని దంపతులు పేర్కొన్నారు. హొటల్ పై వచ్చే స్వల్ప ఆదాయంతో తమ ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నామని, ప్రతిరోజు 12 గంటలు కష్టపడితేనే తప్ప నోట్లోకి ముద్ద దిగదని వారన్నారు. తమ హొటల్ నిర్వహణ పట్ల ఆధరాభిమానాలను చూపిస్తున్న కాలనీవాసులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను కొనసాగించాలి



గుండాల, సూర్య (మేజర్ న్యూస్)– మండల పరిధిలోని కాచనపల్లి గ్రామంలో గతంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో స్పోర్ట్స్ స్కూలు ఏర్పాటు చేయడం వల్ల మారుమూల గుండాల మండలంలోని విద్యార్థులు చదువుకు దూరమై పోతున్నారని ప్రభుత్వం తక్షణమే గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను కొనసాగించాలని ఆ పాఠశాల మాజీ ఎస్ఎంసి చైర్మన్ చాట్ల సూర్యనారాయణ సంబంధిత అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కాచనపల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో సుమారు 500 మంది ఈ ప్రాంత విద్యార్థులతో సజావుగా నడుస్తున్న పాఠశాలలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల తరగతికి సుమారు 40 మంది విద్యార్థులు ఇతర ప్రాంతాల వారు ఇక్కడికి వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు. ఫలితంగా ఏజెన్సీ మారుమూల గుండాల మండలంలోని విద్యార్థులు సక్రమంగా నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలను ఎత్తివేయడంతో చదువుకు దూరమై ఇంటి వద్దనే ఉండే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ చదువుకోవాలనుకుంటున్న విద్యార్థులు ఇల్లందు మండలం రొంపేడు ఆశ్రమ పాఠశాలకు వెళ్లి అక్కడ జాయిన్ అయ్యారు. సుమారు 700 మంది విద్యార్థులు అక్కడ జాయిన్ కావడంతో సరైన వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం అక్కడ కూడా పరిమితికి మించి విద్యార్థులు ఉండటం వల్ల సీట్లు లేక ఇంటి బాట పడుతున్న వైనం నెలకొందని అన్నారు. ఈ విషయమై గత ఫిబ్రవరి నెలలో భద్రాచలం ప్రాజెక్టు ఆఫీసర్ ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కలిసి సమస్యను వివరించడం జరిగిందని సుమారు ఒక గంట పాటు చర్చించిన పిదప వచ్చే జూన్ నెల పాఠశాలలు ప్రారంభ తేదీ వరకు ఆశ్రమ పాఠశాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటివరకు పునరుద్ధరించలేదని ఫలితంగా ఈ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరమై ఇంటి వద్దనే ఉండే పరిస్థితి నెలకొందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి కాచన పల్లి గ్రామంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన కోరారు.

## బస్టాండ్‌లో బంకు ఏర్పాటు అనుమతులు రద్దు చేయండి

- ఆర్టీసీ బస్టాండు ప్రజాప్రయోజనాల కోసమే ఉపయోగించాలి
- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్





చంద్రుగొండ, సూర్య(మేజర్‌న్యూస్) – ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని ప్రయాణికుల అవసరాలకు ఉపయోగించాలి తప్పితే ఆ స్థలంలో బంకు ఏర్పాట్లు నిర్ణయాన్ని రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్కె ఉమర్ డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో పెట్రోల్ బంకు ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి అశోక్ ను ఎస్కె ఉమర్ పార్టీ శ్రేణులతో కలిసి బంకు అనుమతులను రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో నిత్యం వందలాదిమంది ప్రయాణికులతో జన సందోహంగా ఉంటుంది. ఆ ప్రాంతంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు ఆ ప్రాంతంలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని జీవించాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. పొరపాటున జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే ప్రాణ నష్టం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ఆ ప్రాంతంలో బంకు నిర్మాణ అనుమతులు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వరికూటి వెంకట్రావు, తేజావత్ బీముడు, తోలేం వెంకటేశ్వర్లు, డి బాలు, తదితరులు పాల్గొన్నారు.

## రాధక్క మరణం విప్లవ ఉద్యమానికి తీరని లోటు

**–మండల న్యూ డెమోక్రసీ నాయకులు**

టేకులపల్లి సూర్య (మేజర్ న్యూస్)– అనారోగ్యంతో మృతి చెందిన రాధాక్క మరణం విప్లవ ఉద్యమానికి తీరని లోటని టేకుల పల్లి మండల న్యూ డెమోక్రసీ నాయకులు తెలిపారు. గురువారం రాధక్క చిత్రపటానికి పూలమాల వేసి పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన టేకులపల్లిలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా భానుచందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హర్జ మాట్లాడారు. రాదక్క చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరిగానే కాకుండా ప్రత్యక్షంగా ప్రతిఘటన పోరాటంలో పాల్గొన్నారని, గోదావరి లోయ పోరాట ప్రాంతమైన ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, వరంగల్, ములుగు ప్రాంతాలలో సాయుధ దళాలకు ఆమె నాయకత్వం వహించారని ఆయన తెలిపారు. అనేకమార్లు పోలీసు దాడులను ఆమె ఎదుర్కొన్నారని, రహస్య జీవితాల్లోనూ బహిరంగ జీవితంలోనూ ఆమె ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా నికార్సైన విప్లవనేతగా నిలిచారన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన రివిజనిస్ట్, మితవాద పెడ ధోరణులకు వ్యతిరేకంగా ఆమె మనోధైర్యంతోటి పోరాడారని తెలిపారు. విప్లవద్యమంలో జీవితాంతం నిలిచి పోరాడిన రాధక్క 2024 జూన్ 11న హైదరాబాదులో మరణించారని ఆమె వృద్ధాప్యంతో పాటు,క్యాన్సర్ వ్యాధి బారినబడి తుది శ్వాస విడిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కార్యదర్శి నోముల బానుచందర్, అఖిల భారత రైతు కూలీ సంఘం మండల కార్యదర్శి భూక్యా నర్సింగ్, ఐఎఫ్టియు నాయకులు మంచ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి, పి వై ఎల్ మండల కార్యదర్శి తోటకూరి. సతీష్, నరేందర్, భూక్యా కీర్య తదితరులు పాల్గొన్నారు.



# చెట్టు కోసే యంత్రం తగిలి చెయ్యికి తీవ్ర గాయం

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్**



చెట్లు కోసే మిషన్ వలన ప్రమాదవశాత్తు చేతికి తీవ్ర గాయమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.నేలకొండపల్లి మండలం లోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన కుంచం బిక్షం (40) అనే వ్యక్తి గ్రామంలో ఓ రైతు కు చెందిన చెట్లు ను గురువారం మిషన్ (యంత్రం) తో కోస్తుండుగా...ప్రమాదవశాత్తు చేతికి తీవ్ర గాయమైంది. స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

# శ్రీ బాబా దేవలయానికి మైక్ సెట్ సామగ్రి బహుకరణ



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి జూన్ 13)కారేపల్లిలో గల సాయిబాబా దేవలయానికి గురువారం స్థానిక ప్రముఖ వ్యాపారి చిరునోముల మాధవ్ మైక్ సెట్ సామగ్రిని బహుకరించారు. సాయిబాబా దేవలయంలో ప్రస్తుతం ఉన్న మైక్ సెట్ కు అదనంగా ఏర్పాటు చేసేందుకు5వేల రూపాయల విలువైన మైక్ సెట్ సామాగ్రిని ఆలయ అర్చకులు నాగసాయి శర్మకు మాధవ్ అందించారు.ఈ సందర్భంగా మాధవ్ ను ఆలయ కమిటీ,భక్త మండలి సింగరేణి గ్రామ ప్రజలు పెద్దలు మాధవి అభినందించారు.అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు,దాతలు సహకరించాలని శ్రీ సాయిబాబా భక్త మండలి విజ్ఞప్తి చేసింది.

# ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి

**కూసుమంచి సహాయ సంచాలకులు ఎస్. విజయచంద్ర**

**నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్** రైతులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువు కు రశీదు ఇవ్వాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. విజయచంద్ర అన్నారు. మండలం లోని చెన్నారం. మంగాపురం తండా నేలకొండపల్లి గ్రామాలలో ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టాక్ పాయింట్ లో రికార్డుల ప్రకారం ఉన్నాయో లేవా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎరువుల దుకాణంలో కొనుగోలు చేసిన వాటిని తప్పకుండా దరఖాస్తు అందించాలని ఆదేశించారు.అదే విధంగా ఎమ్మార్పీ కి మించి ధరలకు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దుకాణ యాజమానులు తప్పకుండా రికార్డు నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే విత్తన చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయ అధికారిని.డి.అరుణ కుమారి,ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.



# భవిష్యత్తుకు బాటలు వేసేది"బడి" మాత్రమే

## వైరా మున్సిపల్ చైర్మెన్ సూతకాని జైపాల్





వైరా.సూర్యమేజర్ న్యూస్ః-విద్యార్థులు చక్కని నడవడిక కలిగి ఉండాలని విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేర గలుగుతారని పేద విద్యార్థుల కొరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎంతో చేస్తుందని పాఠశాలలు పునః ప్రారంభమైనప్పటికే పాఠ్యపుస్తకాలు. ఏకరూప దుస్తులు. నోట్ పుస్తకాలు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు అందిస్తుందని విద్యార్థులు వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన "బడిబాట"కార్యక్రమంలొ పాల్గొని విద్యార్థులకు వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్. హితవు పలికారు. విద్యార్థులు గతంలో కంటే పదవ తరగతి ఫలితాలు పెంచుతామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ., మాధవరావు తెలిపారు. , ఈ కార్యక్రమంలో వైరా వ్యాపార ప్రముఖులు, మిట్టపల్లి నాగేశ్వరరావు. ధార్నా రాజశేఖర్. ఉపాధ్యాయులు రాజశేఖర్. భాస్కర్ రావు .వెంకటేశ్వరరావు. కృష్ణ. సీతారామారావు. నరసింహారావు. పద్మావతి. మేరీ.అనిత.నీలవేణి. నీలా.పద్మజలు పాల్గొన్నారు.

# పోక్సో కేసు నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష

**సూర్య ప్రతినిధి ఖమ్మం**

చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, 55 వేల రూపాయల జరిమానా విధిస్తూ . ఖమ్మం1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి కె. ఉమదేవి గురువారం తీర్పు వెలువరించారు.ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం, చిమ్మపూడి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కంపాటి కార్తీక్ (20 )అదే గ్రామానికి చెందిన 6 ఏళ్ల చిన్నారిపై కన్నేశాడు. 2023 మార్చి 5 న సాయంత్రం ఆటోలో ఇంటి నుండి ఎత్తుకెళ్లి బాలికపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ లో 2023 మార్చి 6 బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో క్రైమ్ నెంబర్ 54/2023. యివు/ఎస్ 366%ూ,376 ×%ఐపీసీ సెక్షన్ 5 ఆర్ డబ్ల్యు 6 పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తులో నిందుతుడి పాత్ర వుండటంతో పకడ్బందిగా సాక్ష్యాలు సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు రుజువు కావడంతో 1వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి దోషి గా నిర్ధారించి 20 ఏళ్లు జైలు శిక్ష, 55 వేల రూపాయలు జరిమానా విధించారు. నిందుతులకు శిక్ష పడటంలో కీలకపాత్ర పోషించిన దర్యాప్తు అధికారి ఏసీపీ బస్వారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.శంకర్, భరోసా లిగల్ అధికారి యం. ఉమారాణి,కోర్టు కానిస్టేబుల్ జి.రవి కిషోర్ ,కోర్ట్ లైజనింగ్ అధికారులు హెడ్ కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసరావు, మోహన్ రావు,హెూంగార్డు అయూబ్ లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# పెళ్లి కార్డు పై ఏపీ మంత్రి పవన్ కళ్యాణ్ ఫోటో



ముదిగొండ, సూర్య మేజర్ న్యూస్:- ముదిగొండ మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కుటుంబరావుకి పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నాడు. ఈనెల 18న కుటుంబరావు పెళ్లి ఉండగా తన పెళ్లి పత్రికపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోటో మరియు జనసేన గుర్తుని ముద్రించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. ముదిగొండ మండల జనసేన కో ఆర్డినేటర్ గా జొన్నలగడ్డ కుటుంబరావు పని చేస్తూ పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఎన్నో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ ఎవరికి రక్తం కావాలన్నా నిత్యం అందుబాటులో ఉంటూ ఇప్పటికీ పదిహేను సార్లకి పైగా రక్త దానం చేసినట్లు తెలిపారు అయితే ప్రస్తుతం జిల్లాలోనే ఈ పెళ్లి కార్డు వైరల్ గా మారింది.


# విరిగిన విద్యుత్ స్తంభాలు

## జలమయమైన రహదారులు

## సేదతీరిన ప్రజలు









మధిర, సూర్య మేజర్ న్యూస్:మధిర పట్టణములో గురువారం మధ్యాహ్నం గాలి, ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షం పట్టణములో విధ్వంసం సృష్టించింది. కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీ వ్యవస్థ లేక అంతర్గత, ప్రధాన రహదారులు చిన్నపాటి చెరువులను తలపించాయి బజారులో వర్షపునీరు పోయే దారిలేక కొన్ని ఇళ్ళలోకి చేరింది. రహదారిలో మోకాలులోతు వరకు నీరు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.ఈదురు గాలులకు రహదా రులపై పెద్ద, పెద్ద చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, వాటిని తొలగింపు చర్యలను అధికారులు చేపట్టారు. ఈదురు గాలుల విధ్వంసానికి విద్యుత్ స్తంభాలు విరిగిపోయి సరఫరా నిలిచిపోయింది.విద్యుత్ సరఫరాను పునరుద్ధరిచేందుకు ట్రాన్స్కో సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎండలకు అల్లాడిన ప్రజలు ఈ భారీ వర్షానికి సేదతీరారు.

కొద్దిపాటి వర్షానికే పాఠశాల జలమయం

# విఎం బంజర జెడ్పిహెచ్ పాఠశాల ప్రధాన సమస్య ఎమ్మెల్యే రాగమయికి విజ్ఞప్తి

పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్...తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి పాల్గొన్నారు. పెనుబల్లి మండలం వియ్యం బంజర జెడ్ పి హెచ్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రధానో పాధ్యాయులు సత్యం అధ్యక్షతన జరిగిన విద్యార్థుల సమావేశంలో జడ్పిటిసి చెక్కిలాల మోహన్రావు, ఎంఈఓ, హెచ్ఎం లు పాఠశాల ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే రాగమయికి వివరించారు. ప్రధాన రహదారి రోడ్డు మేరకై పాఠశాల ఆవరణం లోతట్టు ప్రాంతంగా తయారవడంతో పాఠశాలలో వర్షపు నీరు బయటకు వెళ్లే సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికి రెండు అడుగుల పైగా నీరు నిల్వ చేరుతుందని వర్షాకాల సమయంలో విద్యార్థులు అవస్థలకు గురి అవుతున్నారని పాఠశాల ప్రధాన సమస్యగా ఎమ్మెల్యే రాకమయి దృష్టికి తీసుకెళ్లారు. వియ్యం బంజర పాఠశాలకు ఎంతో చరిత్ర ఉందని జిల్లాలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా గుర్తింపు పొందిందని తెలిపారు. పాఠశాలలో ఇతర సమస్యలను వివరించారు. పాఠశాల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సమస్యను పరిష్కార దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# ఒక్కో విద్యార్థికి రూ. 80 వేలు వెచ్చిస్తున్న ప్రభుత్వం

**ప్రైవేట్ స్కూల్స్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలు**
**కృషితో లక్ష్యాన్ని చేరుకోవడమే విద్యార్థి లక్ష్యం**
**బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి**







**పెనుబల్లి సూర్య మేజర్ న్యూస్....**

ఎక్కడ చదివామన్నది కాదు.. ఎంత బాగా కృషి చేసి లక్ష్యాన్ని సాధించామనేదే ముఖ్యమని ఒక్కో విద్యార్థికి రూ. 80 వేలు తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేస్తుందని సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పెనుబల్లి మండలంలోని లంకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వి.ఎం.బంజర్ జిల్లా ఉన్నత పాఠశాల, టేకులపల్లి మోడల్ స్కూల్ లో బడిబాట కార్యక్రమంలో ఆమె పాల్గోన్నారు. విధ్యార్థులకు వాచక పుస్తకాలు, నోటు పుస్తకాలు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి విద్యార్థులతో మట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. ఈ నెల 6 నుండి 19 వరకు బడిబాట కార్యక్రమంలో భాగంగా డ్రపౌట్ అయిన పిల్లలను బడికి వచ్చేల చేసిన ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని అధ్యాపకులను అభినందించారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా విద్యార్థులకు స్కూల్స్ ఓపెన్ అయిన మొదటి రోజే దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు స్కూల్స్ ఎక్కడ తీసిపోకుండా దీటుగా తీర్చిదిద్దడం జరిగిందని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ ఇరుకుగా ఉంటాయని ప్రభుత్వ పాఠశాలలో విశాలంగా ఆహ్లాదకరంగా ఉంటాయని తెలిపారు. తమ పిల్లలు ప్రైవేట్ స్కూల్లో చదివితే భవిష్యత్తు బాగుంటుందన్న భ్రమలో తల్లి దండ్రులు ఉన్నారని ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయి అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్య బోధన ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టి విద్యలో రాణించి భవిష్యత్తులో 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఎమ్మెల్యే రాగమ విద్యార్థులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే దంపతులను శాలువా కప్పి పూల మాలలతో అధ్యాపక సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, జడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ గంట ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమరాజు సీతారామారావు, చీకటి రామారావు, గూడూరు మాధవరెడ్డి, మేకతొట్టి కాంతయ్య, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, బొర్రా కోటేశ్వరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, గోగినేని రమేష్, ఈడ కమలాకర్, కావిటి శ్రీను, గొంతు మాధవరావు, వంగ నిరంజన్, వసుమర్తి విశ్వనాథ్, షేక్ కరిముల్లా, బల్లికాసులు, కర్రి కమలాకర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరస్వతి మాత విగ్రవిష్కరణ..



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి జూన్ 13)మండలంలోని గాంధీనగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సరస్వతి మాత విగ్రహాన్ని మండల విద్యాశాఖ అధికారి జయరాజు ఆవిష్కరించారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వెంకటేశ్వర్ల దంపతుల కుమారుడు రాహుల్ కుమార్తె సుష్మ సహకారంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి జయరాజు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలలో సరస్వతి మాత విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.విద్యార్థిని విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోకి రాగానే సరస్వతి మాతాకు పూజలు చేసి పాఠశాలల్లోనే తరగతి గదులలకు వెల్లి ప్రశాంతంగా తాము చదువుకునేలా ఉన్నాయన్నారు. మార్చి నెల..ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో 9.8 జిపితోమండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థి జి వినయ్ కుమార్ ని ఎంఈఓ,పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి నామ, మాణిక్యారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్,వేణు మాధవరావు, పాఠశాల సిబ్బంది పద్మ, జ్యోతి, మప్రేమ్ సాగర్,రమేష్,వీరభద్రం, విజయ,శ్రీవాణి,వివో జయసుధ తదితరులు పాల్గొన్నారు.

## దశ దిన కర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

**కల్లూరు సూర్య మేజర్ న్యూస్ జూన్ 13 :**



మండల పరిధి తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన సోంబత్తిని ఏసు ఇటీవల మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. అందులో భాగంగా సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, లింగాల కమల్ రాజు బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, పాలెపు రామారావు సి పి యం పార్టీ నాయకులు తాతా భాస్కరరావు, జడ్ పీ టీ సీ సభ్యులు కట్టా అజయ్ కుమార్, పోచవరం సొసైటీ అధ్యక్షులు నర్వనేని పెద్ద అంజయ్య, మాజీ యం పీ టీ సీ సభ్యురాలు మర్శ కట్ల మేరమ్మ, తదితరులు ఏసు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దకోరుకొండి మాజీ గ్రామ సర్పంచ్, వేము రత్తమ్మ ఇస్సాకు, ఫాదర్లు, జొన్నలగడ్డ రూబెన్, మర్శకట్ల ప్రసాద్, గ్రామ నాయకులు మర్శకట్ల పెద్ద దరగయ్య సోంబత్తిని కృష్ణ, సండ్ర అనుచరులు విరివిగా పాల్గొన్నారు.

## మధిర కు ఎస్టీ గురుకుల పాఠశాల

### ఎస్టీ బాలుర వసతి గృహంలోనే ఎస్టీ గురుకుల పాఠశాల ఏర్పాటుకు రంగం సిద్ధం

మధిర, సూర్య మేజర్ న్యూస్:బడుగు, బలహీన వర్గాలతో పాటు అల్పసంఖ్యాక వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించి ఉన్నతంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి ప్రతి యేటాకోట్లాది రూపాయలు వెచ్చిస్తోన్న విషయం తెలిసిందే. అదే కోవలో మధిరలో గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని తలంపుతో గురువారం తాసిల్దార్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్ సి ఓ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కే.వెంకటేశ్వరరాజు, ఏవో కే. నరేంద్ర లు ఎస్టీ గురుకుల పాఠశాల ఏర్పాటు కోసం స్థలంను పరిశీలించి చివరగా ఎస్టీ బాలుర వసతి గృహంలోని ఎస్టీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయుటకు ప్రభుత్వానికి సిఫారస్ చేశారు.



## ఏసు దశ దిన కర్మలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తోటకూర



**కల్లూరు సూర్య మేజర్ న్యూస్ జూన్ 12 :**

మండల పరిధి తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన సోంబత్తిని ఏసు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. అందులో భాగంగా గురువారం ఏసు దశ దిన కర్మలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోటకూర శేషగిరిరావు, సి పి యం పార్టీ నాయకులు, తాతా భాస్కరరావు, పోచవరం సొసైటీ అధ్యక్షులు, నర్వనేని పెద్ద అంజయ్య,మాజీ మహిళా యం పీ టీ సీ సభ్యురాలు మర్శకట్ల మేరమ్మ, పెద్ద దరగయ్య,మాజీ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు జొన్నలగడ్డ ప్రసాదు, ముదిగొండ్ల అంజయ్య, తదితరులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, జొన్నలగడ్డ ప్రభుదాస్, జొన్నలగడ్డ రాము, జొన్నలగడ్డ బాలరాజు తదితరులు ఏసు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## పిఆర్సి బకాయిలు విడుదల పట్ల గోపాల మిత్రులు హర్షం

**కల్లూరు, సూర్య మేజర్ న్యూస్(జూన్13):**



పశుసంవర్ధక శాఖ అనుబంధంగా పశుగణాభివృద్ధి సంస్థలు లో23 సంవత్సరాలుగా పనిచేస్తున్న గోపాల మిత్రులకు పిఆర్సి బకాయిలువిడుదల పట్ల హర్షం వ్యక్తం చేసిన గోపాల్ మిత్ర సంఘ జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు సత్తుపల్లి నియోజకవర్గ గోపాల మిత్ర సంఘ అధ్యక్షులు ఖమ్మంపాటి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో పశు గన అభివృద్ధి శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రులు 1530 మందికి పెండింగ్ పిఆర్సి బకాయిలు 7,36,18,360 కోట్ల రూపాయల ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విడుదల చేయడం పట్ల గోపాలమిత్రుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వర్లు సత్తుపల్లి నియోజకవర్గ గోపాలమిత్ర అధ్యక్షులు ఖమ్మంపాటి అప్పారావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గోపాలమిత్ర సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ విధంగా పెండింగ్లో ఉన్న 21 నెలల పిఆర్సి బకాయిలను విడుదల చేసింది అన్నారు .మిగిలిన సమస్యల సైతం త్వరలోనే పరిష్కారం అవుతాయని ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా మా గోపాలమిత్రుల పెండింగ్ బకాయిలు విడుదల కు కృషి చేసినటువంటి ఖమ్మం జిల్లా మంత్రి మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి కి, గోపాలమిత్ర అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెరుకు శ్రీనివాసరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోని కల్లూరు మండలం గోపాలమిత్ర అధ్యక్షులు ఎన్ కోటేశ్వరరావు, డి రవికుమార్, పి వెంకటేశ్వర్లు, ది విజయ్ కుమార్, డి కృష్ణ ప్రసాద్, ఈ హనుమంతరావు, ఏ శివకృష్ణ, ఆర్ రమేష్, ఏ నాగిరెడ్డి, కే భాస్కర్, బీ మాధవి గోపాల మిత్రులు పాల్గొన్నారు.

# వైరాలో రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

**-భూక్యా వీరభద్రం**

వైరా.సూర్యమేజర్ న్యూస్:నిరంతరం గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 20,21న వైరాలో జరుగుతున్నాయని శిక్షణ తరగతులకు ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి దాదాపు 150 మంది కార్యకర్తలు, ప్రతినిధులుగా హాజరవుతున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. గురువారం వైరా పట్టణం బోడేపూడి భవన్ లో గిరిజన సంఘం సమావేశం లో ఆయన మాట్లాడుతూ భవిష్యత్



పోరాటాలకు రూపకల్పన చేయడానికి కార్యకర్తలకు రాజకీయ తర్ఫీదు ఇచ్చి గిరిజలకు సేవా కార్యక్రమాలతో పాటు ,హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం చేయటానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. అనేక జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గిరిజనుల సమస్యల ఇప్పటికే గిరిజన సంఘం సర్వేలు చేసే సంవత్సరం గుర్తించిందని వాటి పరిష్కారానికి కృషి చేస్తుంది అని తెలిపారు. శిక్షణ తరగతులు విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం జిల్లా, మండల నాయకులు భూక్యా కృష్ణ నాయక్ ,భానోతు హరిచంద్, కృష్ణ కాంత్ ,రాములు, రమేష్ సుధాకర్ ,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పెద్దమ్మ తల్లి అలయంలో వార్షికోత్సవాలు



**సింగరేణి సూర్య మేజర్ న్యూస్**

సింగరేణి(కారేపల్లి జూన్ 13)మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.శుక్రవారం ఆలయంలో మామిడి తోరణాల అలంకరణ,ధ్వజారోహణ,15వ తేదిన అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, ధీక్షాధారణ, హోమాలు, కమిటీచే అన్నదాన కార్యక్రమం, పెద్దమ్మ తల్లి గ్రామసేవ (ఊరేగింపు) ఉంటుందని తెలిపారు. ఉత్సవాల చివరి రోజు 16వ తేదిన గ్రామస్తులచే బోనాల సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయని వారు పేర్కొన్నారు. గ్రామస్తులు, భక్తులు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

## మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించిన : ముత్తినేని

**యువత క్రీడల్లో పాల్గొని నైపుణ్యాన్ని కనపరచాలి**

**నాచేపల్లి మాజీ సొసైటీ చైర్మన్ ముత్తినేని వీరయ్య**

నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ మూడు మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించిన నాచేపల్లి మాజీ సొసైటీ చైర్మన్ ముత్తినేని వీరయ్య.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు మండలాల స్థాయిలో మన గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ముందుకొచ్చిన యువతను అభినందించారు. ఇరుజట్లు ఆడుతున్న క్రికెట్ ను చూసి ఆనందించారు.యువత ముందుకు వచ్చి అందరికీ ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని సూచించారు.క్రీడలు నిర్వహిస్తున్న యువజన సంఘం నిర్వాహకులు గట్టిగుండ్ల విజయ్ బృందాన్ని అభినందించారు.క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న వారు మొదటి బహుమతి ముత్తినేని వీరయ్య,2వ బహుమతి ముంద్ర నాగ ప్రసాద్,3వ బహుమతి అమ్మ చారిటబుల్ ట్రస్టు,4వ బహుమతి కాలపొంగు బాబురావు అందిస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.క్రీడల నిర్వహిస్తున్న నిర్వాహక బృందం నాయకుడు విజయ్ మాట్లాడుతూ క్రీడలు ముగించేంతవరకు ప్రతి ఒక్కరు మీ సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళ్లెం శ్రీను,రేగళ్ల రవి,రాయల రాజేందర్,రాయల రమేష్, గారపాటి లక్ష్మీనారాయణ, రాయల ఆంజనేయులు, చేరుకూరి వీరయ్య,పొన్నం శివరాజ్,పచ్చ జగదీష్ వినుకొండ శ్రీను, యాతాకుల శ్రీనాథ్,క్రీడ నిర్వాహకులు గట్టిగుండ్ల విజయ్ బృందం,యూత్ క్రీడాకారులు అబినాష్,సుభాన్,సింహాద్రి పవన్,మనోజ్,ప్రభాస్, నరేందర్ పాల్గొన్నారు.



## నీట్ ర్యాంకర్ బొంతు భగత్ ను అభినందించిన నున్నా నాగేశ్వరరావు

**-ప్రజా వైద్యునిగా పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలి**

**-సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



వైరా.సూర్యమేజర్ న్యూస్: జాతీయ మెడికల్ ప్రవేశ పరీక్ష (నీట్)లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 720 మార్కులకు 595 మార్కులు సాధించి వైద్య విద్యను అభ్యసించబోతున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ బొంతు సమతల తనయుడు బొంతు భగత్ ను సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు శాలువా కప్పి, పూల బోకే ఇచ్చి ఘనంగా అభినందించారు. గురువారం సిపిఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నీట్ ర్యాంకర్ బొంతు భగత్ కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో బొంతు భగత్ ఎంబిబిఎస్ సీటు సాధించడం అభినందనీయం అన్నారు. తల్లిదండ్రుల స్ఫూర్తితో వైద్య విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఆశయాల సాధనకు ఘప్రజా వైద్యునిగా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు తాల్లపల్లి కృష్ణ, వైరా పట్టణం, రూరల్, కొణిజర్ల మండలాల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, పట్టణ నాయకులు చింతనిప్పు చలపతిరావు, బోడపట్ల రవీందర్, మల్లెంపాటి రామారావు, హరి వెంకటేశ్వరరావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల రజిత, అనుమోలు రామారావు, రాచబంటి బత్తీరన్న, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నర్సింహారావు, సంక్రాంతి నరసయ్య, బెజవాడ వీరభద్రం, సంక్రాంతి పురుషోత్తం, పారుపల్లి చంద్రశేఖర్ బాబు, షేక్ జమాల్ సాహెబ్, తోట కృష్ణవేణి, మాడపాటి రామారావు, షేక్ నాగుల్ పాషా, చిత్తారు మురళి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకదుర్గ**



నేలకొండపల్లి సూర్య మేజర్ న్యూస్ అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకదుర్గ సూచించారు. మండలం లోని కట్టుకాసారాం గ్రామంలో గురువారం అంగన్వాడీ బడిబాట కార్యక్రమం ను నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, తల్లులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మూడేళ్లు నిండిన వారిని కేంద్రంలో చేర్పించాలని సూచించారు. ఐదు సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరిని బడిలో చేర్పించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం ను పొందాలని అన్నారు. కేంద్రాలలో ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ఆటా, పాట,విద్యా బోధన కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పార్వతి, టీచర్స్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తీవ్రమైన చర్యలు ...డీఏఓ



కూసుమంచి సూర్య మేజర్ న్యూస్ ....మండలంలోని కూసుమంచి, నాయకన్ గూడెం గ్రామాలలోని ఎరువుల, విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల తనిఖీ చేశారు. ప్రతి డీలరు పిఓవైస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలను చేయాలని, లైసెన్సు, స్టాక్ బోర్డు, ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. స్టాక్ బోర్డును రైతులుకి అర్థమయ్యేలా తెలుగులో ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజు విత్తన అమ్మకాలను రైతు వారీగా రిజిస్టర్ లో పొందుపరచాలని సూచించారు. ఏ డీలర్ అయినా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన డీలర్లు అందరూ ఇన్వాయిస్, సోర్స్ సర్టిఫికేట్, ఫామ్ సి మరియు జీవోటీ టెస్ట్ రిపోర్ట్ లను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. డీలర్లు అందరూ విత్తన చట్టం, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్, ఇన్సెక్టిసైడ్స్ ఆక్ట్ మొదలైన వాటికి లోబడి వ్యాపారం చేయాలని ఎవరైనా నియమాలను అతిక్రమించినట్లయితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు విజయచంద్ర మరియు మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి పాల్గొన్నారు.

## డీసీసీబీ పాలకవర్గ సమావేశం ను బహిష్కరించిన డైరెక్టర్లు

సూర్య మేజర్ న్యూస్ . డి. సి. సి.బి పాలక వర్గ సమావేశాన్ని 10 మంది డైరెక్టర్ బహిష్కరించారు.డీసీసీబీ అధ్యక్ష పదవి ఎన్నికను అజండాలో ఎందుకు పొందుపర్చలేదని సభ్యుల ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులో ఖాళీగా ఉన్న 4 డైరెక్టర్ల పదవులకు ఎన్నిక జరపాలని మెజార్టీ డైరెక్టర్లు తీర్మానం చేసిన అజండాలో పెట్టలేదని విమర్శించారు.ఎన్నికల కోడ్ సమయంలో బ్యాంకు ఉద్యోగుల బదిలీలు...హెచ్ ఆర్సీకి భిన్నంగా జరిగిన వాటిపై పరిశీలన జరిపి రివ్యూ చేయాలని డైరెక్టర్ల డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్లను అధికారులకు,పాలకవర్గ సబ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా 78 లక్షల పంపిణీ సరైంది కాదని ఖండించారు.ఈ కార్యక్రమం లో తుళ్లూరి బ్రహ్మయ్య, లక్కినేని సురేందర్, బొర్రా రాజశేఖర్, మేకల మల్లీ బాబు యాదవ్, బి లక్ష్మణరావు, నూకల సైదులు, ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, చావా వేణుగోపాలకృష్ణ మోదుగు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు



సూర్య


శనివారం 01, జూన్ 2024

# సర్వాంగ సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు

**-ఆటపాటలతో విద్యాబోధన**
**-రీడ్ కార్నర్ల ఏర్పాటు**



అశ్వారావుపేట, సూర్య (మేజర్‌న్యూస్)-నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట కాంప్లెక్సు పరిధిలో ఉన్న పాఠశాలలన్నిటిని పండుగ వాతావరణంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలు రంగు కాగితాలతో అలంకరించి తొలిరోజు విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు అధికారులు, ఉపాధ్యాయులు. విద్యార్థులకు ఎదురేగి ఆహ్వానించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అశ్వారావుపేట సముదాయంలో 14 లోకల్ బాడీ, ఒక ఎయిడెడ్ 3 గురుకులాలు ఉన్నాయి. వీటిలో అడ్మిషన్లను ప్రారంభించారు. విద్యార్థులకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. జూన్ 6వ తేదీనుండి ఉపాధ్యాయులంతా బడిబాట కార్యక్రమాలను నిర్వహించి గ్రామాలలో తిరిగి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల ప్రత్యేకతలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేసి అడ్మిషన్లను పెంచేందుకు కృషి చేసారు. బడిబయటి పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులను కలిసి చదువు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కాప్లెక్సులో మనఊరు-మనబడిలో ఆరు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి లతో ఎనిమిది పాఠశాలలకు మరమ్మత్తులు, తాగునీటి సౌకర్యం, విద్యుత్



సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. ఒక్క పేటమాలపల్లి పాఠశాలలో స్లాబ్ మరమ్మత్తులు మినహా అన్ని పాఠశాలల్లోను పనులన్ని పూర్తి గావించారు. రంగులు కూడా వేయనున్నారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదులను చిన్న పిల్లలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేవిధంగా ఛోటాభీమ్ ,టామ్ అండ్ జెర్రీ ,రెయిన్బో వంటి కార్టూన్ బొమ్మలతో పెయింటింగ్ వేశారు. గ్రంధాలయ పుస్తకాలతో రీడ్ కార్నర్ లను ఏర్పాటు చేశారు. ఏప్పటి వలెనే కాంప్లెక్సుస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. దీంతో ప్రయివేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను చేర్చడానికి తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. 13వ తేదీ ఒక్కరోజులోనే కాంప్లెక్సు మొత్తంలో 36 నూతన అడ్మిషన్ లు జరిగినట్లుగా ఉపాధ్యాయులు తెలిపారు. బడిబాట కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తుందని వారు అంటున్నారు.

# ఘనంగా కొర్రాజుల జాతర వేడుక



అశ్వారావుపేట సూర్య, (మేజర్‌న్యూస్)-మండల పరిధిలోని గుర్రాలచెరువు గ్రామంలో చిన్నకొర్రాజుల స్వామివారి జాతర వేడుక ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు చిన్నకొర్రాజుల స్వామివారికి సాంప్రదాయబద్ధంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. గ్రామ పెద్దలు, కుటుంబ పెద్దలు, బంధు మిత్రులతో మొక్కుబడులు చెల్లించుకున్నారు.



# భారత విప్లవోద్యమంలో రాధక్కది ప్రత్యేక స్థానం

ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)- భారతదేశ విప్లవద్యంలో రాదక్కది ప్రత్యేక స్థానమని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి భానోతు ఉక్లానాయక్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన గోదావరిలోయ ప్రతిఘటన పోరాట యోధురాలు చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరి రాధక్క సంతాప సభలు జూన్-12 నుండి 20 వరకు నిర్వహించాలని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఇల్లందు పట్టణంలో రాధక్క చిత్రపటనికి పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బాణోత్ ఊక్లా నాయక్ మాట్లాడుతు రాధక్క కమ్యూనిస్టు వాతావరణం కలిగిన కుటుంబంలో పుట్టి పెరిగి విద్యార్థి దశలోనే ఉద్యమ జీవితం ప్రారంభించి కమ్యూనిస్టు ఉద్యమంలో ఏర్పడిన మితవాద, రివిజనిస్టు ధోరణులను వ్యతిరేకిస్తూ సిపిఐ (ఎం-ఎల్) విప్లవ రాజకీయాల వైపు నిలిచి అజ్ఞాత జీవితాన్ని గడిపిందని తెలిపారు. గోదావరి లోయ ప్రాంతంలో ప్రతిఘటన ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిందనిపేర్కొన్నారు. ఈ తరుణంలో ఎందరికో స్ఫూర్తిదాయకంగా రాధక్క నిలిచిందనిఅన్నారు. రాధక్కకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల, ఇల్లందు ప్రాంతాలతో ఎంతో ఉద్యమ అనుబంధం ఉందని ఈ ప్రాంతాలను పోరాట కేంద్రాలుగా చేసుకొని అనేక పోరాటాలు నిర్వహించిందని, ఆ పోరాటలను నేటికీ ఈ ప్రాంత పల్లెలు మరువలేదని అంతటి ప్రజాదారణ కలిగిన రాధక్క అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి బి రాంసింగ్, జిల్లా నాయకుడు బి ఎం కాంతారావు, పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి ఎ సాంబ, జిల్లా కోశాధికారి జె గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ సిబ్బందితో చైర్మన్ రివ్యూ మీటింగ్

**- పారిశుద్ధ్యం పనులు పకడ్బందీగా విధులు నిర్వహించాలి**
**- చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు**



ఇల్లందు, సూర్య (మేజర్ న్యూస్)-స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు బుధవారం సెక్షన్ల వారీగా రివ్యూ మీటింగ్ నిర్వహించారు. రానున్నది వర్షాకాలం సీజన్ కాబట్టి ముఖ్యంగా శానిటేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. దోమలు రాకుండా ఫాగింగ్ , చెత్తను బయట ఎక్కడ వేయకుండా అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య వాహనాల్లోనే చెత్తను వేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజలను చైర్మన్ కోరారు. అదే విధంగా మున్సిపల్ ఆదాయాన్నిపెంచేందుకు అధికారులు కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. బకాయి పడ్డ ఇంటి , పంపు టాక్స్ లను ఆయా ఇంటి యజమానులు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. టెండర్ పిలిచిన షాపులను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు పట్టణంలో ఎక్కడ ఇంక్రోజ్మెంట్ జరిగిన వెంటనే వారి పైన చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పర్మిషన్ లేని కట్టడాలకు వెంటనే నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఇల్లందు పట్టణ రహదారి ఇరువైపులా ఏక్కడ ఎంక్రోజ్మెంట్ జరిగినా వెంటనే తొలగించాలన్నారు. అదేవిధంగా ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బంది నిర్మాణంలో ఉన్న కట్టడాలను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అసంతృప్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో బ్లీచింగ్ పౌడర్ ప్రతివార్డుకి పంపించాలన్నారు. నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి డి ఈ నవీన్, మేనేజర్ అంకు షావలి, అకౌంటెంట్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ , ఏఈ శంకర్, టిపిఓ సతీష్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ, జూనియర్ అసిస్టెంట్లు, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణిలో డిపెండెంట్ వయసు 40 కి పెంచడం ఏఐటియుసి కృషి ఫలితమే

**-మిర్యాల రంగయ్య.**

ఇల్లందు టౌన్, సూర్య (మేజర్ న్యూస్)-సింగరేణిలో ఉద్యోగం 35 సంవత్సరాల ఉండేదని 40 సంవత్సరాలు చేయాలని ఏఐటియుసి అనేక సంవత్సరాలుగా యాజమాన్యానికి విజ్ఞప్తులు పోరాటాలు చేసిన ఫలితమే నేడు డిపెండెంట్ ఉద్యోగుల వయసు 40 కి సింగరేణి యాజమాన్యం పెంచిందని కేంద్ర కమిటీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జే కే ఓసీలో, జిఎం కార్యక్రమంలో, ఇల్లందు ఏరియా వైద్యశాలలో ఫిట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మిర్యాల రంగయ్య హాజరై మాట్లాడుతూ డిపెండెంట్ ఉద్యోగుల కోసం 40 సంవత్సరాల కు వయసును పెంచాలని ఏఐటీయూసీ అనేక విజ్ఞప్తులు పోరాటాలఫలితంగానే నేడు సింగరేణి యాజమాన్యం 40 సంవత్సరాలకు డిపెండెంట్ ఉద్యోగుల వయస్సును పెంచిందని ఇట్టి విషయాన్ని సర్క్యులర్ ద్వారా కార్మికులకు తెలియపరచడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇల్లందు జే కే ఓ సి విస్తరణ పనులు వేగవంతం చేయాలని, బొగ్గు తీసే పనులు సింగరేణి చేపట్టాలని, ప్రవేటు పరం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. సింగరేణి వాస్తవ 2023 -24 వార్షిక లాభాలు ప్రకటించి కార్మికులకు 35% వాటా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి నూతన గనులకు శ్రీకారం చుట్టాలని కార్మికులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎం డి.నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, క్లర్కు స్టాప్ ఇన్చార్జి షేక్ ముస్తఫా, ఫిట్ కార్యదర్శులు సంజీవచారి, బొల్లి రామయ్య, బుల్లెద్దు శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, ఆర్. పైడిరాజు, లచ్చిరాం, అనిత, బి. బాలాజీ,నూనె శ్రీనివాస్, జయరాజ్, జక్కుల శ్రీనివాస్, తిరుమలరావు, చాంద్ పాషా, వీరన్న, దాట్ల శ్రీకాంత్,ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి బడిబాట - చిన్నారుల జీవితానాకీ పూలబాట



## – కౌన్సిలర్ సాహేర బేగం

కొత్తగూడెం అర్బన్, సూర్య (మేజర్ న్యూస్)– అంగన్వాడి బడిబాట చిన్నారుల జీవితానికి పూలబాటని స్థానిక కౌన్సిలర్ సాహేర బేగం తెలిపారు. గురువారం 25 వార్డులో లోనీ గాజులరాజం బస్తి 5,6,7 సెంటర్ల ఆధ్వర్యంలో జరిగిన బడిబాట కార్యక్రమంలో సాహేరా బేగం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు, పెద్దలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడి బడిబాట కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో రెండున్నర సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలు లోపు బడి బయట పిల్లల్ని తప్పకుండా అంగన్వాడి కేంద్రాలకు పంపాలని కోరారు. అంగన్వాడి సెంటర్‌లో చిన్నారులకు మానసిక శరీరకవృద్ధి, వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్యపరీక్షలు, పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్యా సామూహిక అక్షర అభ్యాసాలు, పాలు గుడ్డు, ఒక పూట సంపూర్ణ ఆహారం అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శైలజ, రాజకుమారి, ఆయాలు, ఆర్.పి.రాజకుమారి, ఓబ్ అనూష, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# అధికారులు మీతీరు మార్చుకోరా !!???

## -దీర్ఘకాలంగా తిష్ట వేసిన అధికారులు
## -పదేళ్లుగా పనిచేస్తున్నా పట్టించుకోని యాజమాన్యం



కొత్తగూడెం సింగరేణి ,సూర్య(మేజర్‌న్యూస్)– సింగరేణి యాజమాన్య నిర్లక్ష్యవైఖరి కారణంగా వాలు విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు గత పది సంవత్సరాలకు పైగా సింగరేణి ప్రధాన కార్యాలయంలో తిష్ఠ వేసి తమ ఆధిపత్యాన్ని చాటుకుంటున్నారు. కీలకమైన విభాగాల్లో పనిచేస్తూ అటు పైఅధికారులను మెప్పిస్తూ తమ పబ్బం గడుపుకుంటూ కింది సాయి సిబ్బంది పై కక్షసాదింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు విన్పిస్తోన్నాయి. సింగరేణిలోని 12ఏరియాలకు సంబంధించి ఉద్యోగులు, కార్మికులకు సంబంధిం చిన సంక్షేమం ఇతర వసతులను సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తుంటారు. దీంతో సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కీలక విభాగాలైన విజిలెన్స్, పర్చేజ్, ఎకౌంట్స్, రిక్యూట్మెంట్ సెల్, సివిల్, ఐటీ, వెల్ఫేర్తోపాటు పలు విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ కాకుండా ఒకే విభాగంలో కొనసాగడం వివాదాలకు దారితీస్తోంది. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన గైడ్లైన్స్ ప్రకారం ఒక అధికారి ఒక విభాగం లేదా ఒక ఏరియాలో మూడు సంవత్సరాలు మాత్రమే విధులు నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల ప్రయోజనాలు, అధికారుల వ్యక్తిగత అవసరాల నేపథ్యంలో బదిలీలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒకే విభాగంలో ఎక్కువ కాలం తిష్ట వేసిన అధికారులు పలు అక్రమాలకు సైతం పాల్పడుతున్నారనే ప్రచారం సాగుతుంది. గత ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో అధికశాతం మంది అదికారులు అటు ప్రజాప్రతినిదులు ఇటు గుర్తింపు కార్మికసంఘం నేతల నుంచి వత్తిడి తీసుకువచ్చి తమ సీట్లను భద్రపర్చుకొని విదులు నిర్వహిస్తున్నారనే ప్రచారం సాగుతుంది. గత డిసెంబరులో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పలువురిని బదిలీ చేయించేందుకు ప్రయత్నాలు సాగించినప్పటికీ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరగడం, పార్లమెంట్ ఎన్నికల కారణంగా ఎన్నికల నిబంధనల వల్ల బదిలీలు నిలిచిపోయాయి. కార్మికుల సంక్షేమం ఇతర వసతులను సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తుంటారు. దీంతో సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కీలక విభాగాలైన విజిలెన్స్, పర్చేజ్, ఎకౌంట్స్, రిక్యూట్మెంట్ సెల్, సివిల్, ఐటీ, వెల్ఫేర్ పాటు పలు విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ కాకుండా ఒకే విభాగంలో కొనసాగడం వివాదాలకు దారితీస్తోంది. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన గైడ్లైన్స్ ప్రకారం ఒక అధికారి ఒక విభాగం లేదా ఒక ఏరియాలో మూడు సంవత్సరాలు మాత్రమే విధ ణలు నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల ప్రయోజనాలు, అధికారుల వ్యక్తిగత అవసరాల నేపథ్యంలో బదిలీలు చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఒకే విభాగంలో ఎక్కువ కాలం తిష్ట వేసిన అధికారులు పలు అక్రమాలకు సైతం పాల్పడుతున్నారనే ప్రచారం సాగుతుంది. గత ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతో అధికశాతం మంది అధికారులు అటు ప్రజాప్రతినిధులు ఇటు గుర్తింపు కార్మికసంఘం నేతల నుంచి వత్తిడి తీసుకువచ్చి తమ సీట్లను భద్రపర్చుకొని విధులు నిర్వహిస్తున్నారనే ప్రచారం సాగుతుంది. గత డిసెంబరులో నూతనంగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పలువురిని బదిలీ చేయించేందుకు ప్రయత్నాలు సాగించినప్పటికీ సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరగడం, పార్లమెంట్ ఎన్నికల కారణంగా ఎన్నికల నిబంధనల వల్ల బదిలీలు నిలిపివేశారే ప్రచారం సాగుతుంది. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కీలక విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు సింగరేణిలో బయోమెట్రిక్ విధానాన్ని సైతం అమల కాకుండా ప్రయత్నాలు సాగించారనే విమర్శలున్నాయి. బయోమెట్రిక్ విధానం వల్ల విదులకు సకాలంలో హాజరుకావడం తిరిగి విధుల నుంచి వెళ్లటం అంతా రికార్డు కావడం వల్ల తమ ఆటలు సాగడం లేదనే నెపంతో బయోమెట్రిక్ విదానానికి తూట్లు పొడిచినట్లు తెలుస్తోంది. సింగరేణి ఏరియాల్లో పనిచేసే అధికారులు అప్రాంతంలోనే కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం ఏరియాల్లో పనిచేసిన అధికారులు కార్పొరేట్లో పనిచేసే అధికారులు ఏరియాలకు బదిలీ కావల్సి ఉన్నప్పటికీ తమకున్న రాజకీయ పలుకుబడితో పలు విభాగాల అధికారులు పక్క విభాగానికి బదిలీ చేయించుకోవడం చర్చనీయాంశంగా మారుతుంది. విజిలెన్స్ విభాగంలో ఎక్కువ కాలం పనిచేసిన అధికారుల వేదింపుల కారణంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్టీపీపీలో ఈ ఎన్ ఎం విభాగంలో సూపరింటెండెంట్ అఫ్ ఇంజనీర్ విదులు నిర్వహిస్తున్న కిరిటీ ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర చర్చనియాంశంగా మారింది. విజిలెన్స్ అధికారుల వేదింపుల కారణంగానే సూపరింటెండెంట్ ఇంజనీర్ కెరిటీ ఆత్మహత్య చేసుకున్నాడనే కోల్మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్(సీఎంవోఏ) కు చెందిన ప్రతినిధులు సింగరేణి ఏరియాలోని పలు జీఎంలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించి తమ నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. సింగరేణి యాజమాన్యం స్పందించి దీర్ఘకాలికంగా సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఒకే విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలని పలు కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# మణుగూరు రైల్వే స్టేషన్ రోడ్డులో వీధిలైట్లు పునరుద్ధరించండి

## -ఐఎఫ్‌టియు



మణుగూరు,సూర్య(మేజర్ న్యూస్)– కూనవరం రైల్వే గేట్ నుండి మణుగూరు రైల్వే స్టేషన్ వరకు వీధిలైట్లు పునరుద్ధరించాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐ ఎఫ్ టి యు) ఆధ్వర్యంలో గురువారం ఏరియా ఇంజనీర్ ఎం నర్సిరెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ రైల్వే స్టేషన్ రోడ్డులో వీధిలైట్లు వెలగకపోవటంతో రైలు ప్రణికులతోపాటు ఇదే రోడ్ లో రాత్రి వేళల్లో ప్రయాణించే సింగరేణి పునరావాస న్యూ పద్మగూడెం . రాయన్న పేట గిరిజనులు రాత్రి వేళలో ఇబ్బంది పడుతున్నారన్నారు. వీధిలైట్ల ఏర్పాటుతోపాటు ఆకతాయిలు వాటిని పగలగొట్టకుండా తగు జాగ్రత్తలు కూడా పాటించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు ఏ మంగీలాల్ పాల్గొన్నారు.

# న్యాయవాదులు నిత్య విద్యార్థులు



కొత్తగూడెంటౌన్,సూర్య(మేజర్ న్యూస్) – న్యాయవాదులు ప్రతిరోజు విద్యార్థి అని జీవితకాలం చట్టాలను చదివి అర్థం చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. తెలంగాణ జూనియర్ న్యాయవాదుల ఫోరం అభ్యర్థన మేరకు కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ నూతన చట్టాలపై అవగాహన శిబిరం న్యాయవాదుల కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేశారు. జూలై 1 నుండి అమలు కానున్న భారతీయ నాగరిక సంహత 2023 లోని కొన్ని ముఖ్యమైన సెక్షన్ల పైన దాదాపు 100 మంది న్యాయవాదులకు లక్కినేని సత్యనారాయణ అవగాహన చేశారు ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటివ్ పోసాని రాధాకృష్ణమూర్తి, గ్రంథాలయ కార్యదర్శి సాధిక్ పాషా, సీనియర్ న్యాయవాదులు గాజుల రామమూర్తి, వివి సుధాకర్ రావు, జి రామచంద్ర రెడ్డి, అత్తులూరి మనోరమ, ఆడపాల మహాలక్ష్మి, పాతూరి విటల్, మారుపాక రమేష్ , దొడ్డ సమంత్, రవితేజ శంకు బాపన అనుదీప్, యాస యుగంధర్, పాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ అండ్ పిసి అధికారిని సన్మానించిన రజాక్



కొత్తగూడెం సింగరేణి,సూర్య(మేజర్ న్యూస్)– కొత్తగూడెం ఏరియా ఎస్ అండ్ పిసి డిపార్ట్మెంట్ కొత్తగూడెం ఏరియాకు నూతనంగా వచ్చిన ఏరియా సెక్యూరిటీ అధికారిని ఐఎన్‌టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండ్ రజాక్ , ఫిట్ కార్యదర్శి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పూల బొకేతో స్వాగతం చెప్పడం జరిగినది. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్ సమస్యల గురించి చర్చించారు. సానుకూలంగా స్పందించిన సెక్యూరిటీ ఆఫీసర్ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణరావు , ఎగ్జిక్యూటివ్ నెంబర్ హానోక్ రాజ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ లు గౌస్, త్రిపాటి, కోశాధికారి సుద్దాల నరసింగం, సుద్దాల శంకర్, సీతారాం, వి సురేష్, సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గా ల వద్ద వసతులు కల్పించండి -మైనారిటీ జిల్లా అధ్య క్షులు ఎండీ. యాకూబ్ పాషా

కొత్తగూడెంటౌన్,సూర్య(మేజర్ న్యూస్) – ఈ నెల 17న తేదీన బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా, మసీదుల వద్ద తగు సౌకార్యాలు కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్య క్షులు ఎండీ. యాకూబ్ పాషా గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 160 మసీదులు , 20 వరకు ఈద్గాలు ఉన్నాయని, బక్రీద్ పండుగను పురస్కరించు కొని, ఈద్ ఉల్ జుహా నమాజ్ ను ఆచరించటానికి ఈద్గా , మసీదుల వద్ద వందలాది మంది ముస్లింలు హాజరవుతారని, శానిటైజేషన్, మంచి నీరు, టెంట్లు, షామియానాలను ఈద్గా, మసీదుల వద్ద ఏర్పాటు చేయాలని మున్సిపల్, మండల అధికారులను కోరారు.